# లెనిన్ స్ఫూర్తితో సమ సమాజ స్థాపనకు పోరాటం చేయాలి

**సీపీఐ (ఎంఎల్) 57వ ఆవిర్భావ దినోత్సవ సభలో పిలుపు**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**




గోదావరిఖనిలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ జయంతి, సీపీఐ (ఎంఎల్) 57వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కే రాజన్న జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కే రాజన్న మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మార్క్సిజంపై దాడులు పెరుగుతున్నాయని, దేశంలో పాలకవర్గాలు ప్రజలపై, కమ్యూనిస్టు ఉద్యమాలపై దాడులను కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం, ఒక మనిషి మరొక మనిషిని దోపిడీ చేయని సమాజ నిర్మాణం కోసం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కృషి చేస్తోందని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రామిక వర్గం నిరంతరం దోపిడీ, అవమానాలకు గురవుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న అభివృద్ధి నినాదాలు ప్రజల జీవితాల్లో ప్రతిఫలించడం లేదని విమర్శించారు. దేశంలో ఆకలి, పర్యావరణం, పత్రికా స్వేచ్ఛ వంటి సూచికల్లో పరిస్థితి దిగజారుతున్నదని వివిధ నివేదికలను ప్రస్తావించారు. సంపద సృష్టించే రైతులు, కార్మికుల వద్ద తక్కువ శాతం మాత్రమే సంపద ఉండటం సామాజిక అసమానతలకు నిదర్శనమని అన్నారు. లౌకిక విలువలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. లెనిన్ ఆలోచనల స్ఫూర్తితో సమ సమాజ స్థాపన దిశగా ఉద్యమాలను బలోపేతం చేయాలని సూచించారు. ఈ సభకు జిల్లా సహాయ కార్యదర్శి ఈ నరేష్ అధ్యక్షత వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణతో పాటు పార్టీ జిల్లా నాయకులు బి అశోక్, చిలుక శంకర్, ఈదునూరి రామకృష్ణ, ఐ రాజేశం, కొల్లూరి మల్లేశం, ఎం దుర్గయ్య, మేరుగు చంద్రయ్య, జీ మల్లేశం, బతుకుల రాజన్న, ఎం కొమరయ్య, ఏ తిరుపతి, కే ఎల్లయ్య, ఎస్ తిరుపతి, ఎస్ ప్రసాద్, ఎడ్ల రవికుమార్, పోగుల శేఖర్, వి మల్లేశం, గుండు రాజయ్య, బి ఆనంద్, పోచయ్య, ప్రభాకర్, ఐ సాంబయ్య, జే భానేష్, ఈ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 22 విప్లవ చరిత్రలో కీలక మలుపు




**లెనిన్ జయంతి, సీపీఐ ఎంఎల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సభ**

**అగ్ని ధార న్యూస్ ,(కరీంనగర్):**

భారత దేశ విప్లవ చరిత్రలో ఏప్రిల్ 22 ఒక కీలక మలుపుగా నిలిచిందని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు పేర్కొన్నారు. లెనిన్ జయంతి, సీపీఐ ఎంఎల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రివిజనిజం, నయా రివిజనిజానికి వ్యతిరేకంగా విప్లవ శక్తులు సీపీఐ ఎంఎల్ పార్టీగా అవతరించిన రోజుగా ఏప్రిల్ 22ను అభివర్ణించారు. మార్క్సిజం--లెనినిజం--మావో ఆలోచనా విధానాన్ని తమ సిద్ధాంతంగా స్వీకరించిన రోజు ఇదేనని తెలిపారు. వ్యవసాయ విప్లవాన్ని కేంద్రంగా చేసుకుని నూతన ప్రజాస్వామిక విప్లవానికి శ్రీకారం చుట్టిన రోజుగా, అర్ధ వలస--అర్ధ భూస్వామ్య వ్యవస్థగా దేశాన్ని విశ్లేషించిన రోజుగా పేర్కొన్నారు. ఎన్నికలు, చట్టసభలను తిరస్కరిస్తూ సాయుధ పోరాటాన్ని ప్రధాన మార్గంగా ఎంచుకున్న చారిత్రక ఘట్టమని వివరించారు. ప్రపంచ తొలి సోషలిస్టు వ్యవస్థ నిర్మాణ కర్త, పీడిత ప్రజల నాయకుడు లెనిన్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన కొనసాగిస్తూ, దేశ సంపదలను కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించే విధానాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో లెనిన్ ఆలోచనల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, జిల్లా కమిటీ నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, గూడూరి వైకుంఠం, ఇనుగాల రాజేశ్వర్, కలవల రాయమల్లు, చిలుక రాజు, ధర్మాజీ నరసయ్య, కిష్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో వలస బాలిక మృతి

**ఇటుక బట్టీల వద్ద భద్రతా లోపాలపై సమతా సైనిక దళ్ ఆగ్రహం**

**అగ్ని ధార న్యూస్ ,(సుల్తానాబాద్):**




పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని ఇటుక బట్టీ వద్ద విషాద ఘటన చోటుచేసుకుంది. వలస కార్మికుల చిన్నారి దివ్య బేహారపై వీధి కుక్కలు దాడి చేసి మృతి చెందింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం మేరకు, ఒడిశా రాష్ట్రానికి చెందిన బాబుర్ బెహరా, సరస్వతి దంపతులు జీవనోపాధి కోసం కాట్నపల్లి ఇటుక బట్టీలో పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు. వారి కుమార్తె దివ్య నివాస ప్రాంతం వద్ద ఆడుకుంటున్న సమయంలో వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రికి తరలించేలోపే చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సహజ మరణం కాదని, ఇటుక బట్టీ యాజమాన్యం నిర్లక్ష్యం, అధికారుల నిర్లిప్తత కారణంగా జరిగిన ఘటన అని పేర్కొన్నారు. వలస కార్మికుల నివాస ప్రాంతాల్లో కనీస భద్రతా చర్యలు లేకపోవడం, వీధి కుక్కల సమస్యను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ఇటుక బట్టీల వద్ద కార్మికులకు సురక్షిత వసతి, మౌలిక సదుపాయాలు కల్పించడం యాజమాన్యాల బాధ్యత అయినప్పటికీ అవి అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల రక్షణకు తగిన చర్యలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని తెలిపారు. మృతి చెందిన బాలిక కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం ప్రకటించాలని, ఇటుక బట్టీ యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వలస కూలీల నివాస ప్రాంతాల్లో తక్షణ భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని, వీధి కుక్కల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిర్లక్ష్యానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# పిల్లల మేధో శక్తి అభివృద్ధే లక్ష్యం




**రామగుండంలో ఎస్ఆర్ఎం స్కూల్ రెడీనెస్ మేళా నిర్వహణ**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

చిన్నారుల మేధో సామర్థ్యాల అభివృద్ధి, ప్రీ-స్కూల్ విద్యకు ప్రోత్సాహం లక్ష్యంగా ఐసిడిఎస్ రామగుండం ప్రాజెక్టు ఆధ్వర్యంలో, ప్రథమ్ ఎన్జీవో సహకారంతో ఎస్ఆర్ఎం స్కూల్ రెడీనెస్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమం 41, 54, 53, 40 డివిజన్ల పరిధిలో నిర్వహించబడింది.

మేళా ప్రధాన ఉద్దేశం అంగన్వాడి ప్రీ-స్కూల్ పిల్లల నమోదు సంఖ్యను పెంచడం, అలాగే పిల్లల అభివృద్ధి స్థాయిని వివిధ అభివృద్ధి అంశాల ఆధారంగా అంచనా వేయడం. ఈ క్రమంలో వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేసి, చిన్నారుల మానసిక, శారీరక, సామాజిక నైపుణ్యాలను పరిశీలించారు. అధికారుల ప్రకారం, ఇలాంటి ఎస్ఆర్ఎం మేళాలు నిర్వహించడం ద్వారా అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల హాజరు, సంఖ్య పెరగడంలో సహకరిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు సూర్య, ముస్తఫా, గట్ల రమేష్, జయప్రద పాల్గొన్నారు. అలాగే రామగుండం ప్రాజెక్ట్ సీడీపీవో అలేఖ్య పటేల్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, చిన్నారుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా అధికారులు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

# నేడు కల్వకుర్తిలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు కడ్తల్ మండలం,కర్కల్ పహాడ్ గ్రామంలో,ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుంకిరెడ్డి ఎస్ఐ డకానిస్టేబుల్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సందర్శించనున్నారు. అనంతరం ఆమనగల్ పట్టణంలోని శ్రీరామదూతా శ్రమాన్ని సందర్శించి శివానంద స్వామి వారిని దర్శనం చేసుకోనున్నారు,అనంతరం మద్గుల మండల కేంద్రంలో ఈనెల 25వ తారీఖు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభంకాబోతున్న ఎస్ఐ , కానిస్టేబుల్ శిక్షణ తరగతుల కేంద్రాన్ని పరిశీలించనున్నారు,అనంతరం వెల్దండ మండలం,చౌదర్పల్లి గ్రామందువ్వాసి కలమ్మ కీ.శే యాదగిరి కూతురి వివాహా వేడుకకు జి పి రెడ్డి బ్యాంక్వెట్ హాల్, ఇంజమూర్,చింతపల్లిలో పాల్గొననున్నారు. అనంతరం వెల్దండ మండలం,ఈధమ్మ బండ తండా,లో వడ్త్యావత్ లాలూ నాయక్ కూతురి వివాహ వేడుకకు హాజరుకానున్నారు.

**అనంతరం వెల్దండ మండలం,**

చౌదర్పల్లి గ్రామం లోని జంపుల మణెమ్మ కీ.శే.రాజు కూతురి వివాహ వేడుక తోడోటి అశోక్ రెడ్డి గార్డెన్ రాఘయి పల్లి పాల్గొననున్నారు. అనంతరం తలకొండపల్లి మండలం,వీరన్న పల్లి గ్రామానికి చెందిన శివ యాదవ్ వివాహ వేడుక వి డి ఎన్ ఫంక్షన్ హాల్,కొత్త రోడ్,లో పాల్గొననున్నారు. అనంతరం చారకొండ మండలం,చంద్రాయన్ పల్లి గ్రామం,సొప్పరి పర్వతాలు కుమారుడి వివాహ వేడుక కె కె ఆర్ ఫంక్షన్ హాల్, చారగొండ పాల్గొననున్నారు. అనంతరం

కల్వకుర్తి పట్టణం కైలాసగుట్టపై నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న అయ్యప్ప స్వాముల విరి మండపం ని సందర్శించనున్నారు. కావున, ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు శ్రేయోభిలాషులందరు హాజరుకలగాలరని మనవి.

# గురుకుల విద్యార్థులకు ఘన సన్మానం



**కలెక్టరేట్‌లో ప్రతిభకు పాఠశాలలో అభినందనలు**

**అగ్ని ధార న్యూస్, (సుల్తానాబాద్):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన 99 రోజుల కార్యక్రమంలో పెద్దపల్లి కలెక్టరేట్‌లో జరిగిన ప్రతిభ ఉత్సవాల్లో మెరిసిన గురుకుల విద్యార్థులకు పాఠశాలలో ఘన సన్మానం లభించింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన బాలికలు ఈ నెల 21న జరిగిన కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ముఖ్యంగా నృత్య ప్రదర్శనలో ఆకట్టుకుని ప్రశంసలు అందుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నిర్వాహకులు రూ. 1000 నగదు బహుమతి, షీల్డ్స్, మెడల్స్ అందజేశారు. ఈ విజయంతో పాఠశాలకు తిరిగి వచ్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం. మంజుల ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. విద్యార్థుల ప్రతిభతో పాఠశాలకు మంచి గుర్తింపు వచ్చిందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ ఎస్. సృజనతో పాటు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

